క్లుప్తంగా

నారాయణస్వామి ఆదాయం రూ.95 వేలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ..94,974 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.46,890, లడ్డు ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22,620, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.22,464, ఇతర విరాళాల కింద రూ.3 వేలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. అన్నదానానికి బేస్తవారిపేటకు చెందిన దొడ్డి నవదీప్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి రూ.10,116 విరాళంగా ఇచ్చారన్నారు.

నేడు గ్రామసభ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచిలక రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 224కు సంబంధించి ఎంజాయ్మెంట్ సర్వేపై మంగళవారం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు. సదరు 224 సర్వే నంబర్‌కు సంబంధించి అవసరమైన రైతులు గ్రామ సభకు వారి భూమి తాలూకు రికార్డులతో వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కోరారు.

పరిమితికి మించి ఎక్కిస్తే సీజ్ చేస్తా


ఆటోను ఆపి మాట్లాడుతున్న ఎస్సై

పీసీపల్లి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే ఆటోలను సీజ్ చేస్తామని ఎస్సై జి.కోటయ్య అన్నారు. సోమవారం విజిబుల్ పోలీస్‌లో భాగంగా ఆటోలో అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలను ఆపి వారికి ఈ మధ్య కాలంలో జరిగిన ప్రమాదాల గురించి వివరించి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒంటరి మహిళలను ఆటో డ్రైవర్లు ఇబ్బంది పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, మరోసారి ఇలా జరిగితే వారిపై పోక్సో కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో యాక్టిజన్ క్లబ్ ఎన్నిక

కనిగిరి రూరల్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు డీఎస్ఎఫ్ సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో సోమవారం యాక్టిజన్ క్లబ్ ఎన్నిక నిర్వహించారు. కమిటీ ఎన్నికల్లో ఏడుగురు పోటీ పడ్డారు. అందులో యాక్టిజన్ క్లబ్ ప్రెసిడెంట్‌గా టి.నిరీక్షణ, వైస్ ప్రెసిడెంట్‌గా గోనా రిత్విక నియమితులైయ్యారు. ఎన్నికల కార్యక్రమ నిర్వహణ అధికారిగా టి.రమణారెడ్డి వ్యవహరించారు. హెచ్ఎం కలువ విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేలా అవగాహన కల్పించామన్నారు.

నూరుశాతం రికవరీ చేయాలి

హనుమంతునిపాడు: పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు నూరుశాతం రికవరీలు చేయించాలని ఏపీఎం పి.రజనీకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులకు, సభ్యులకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు వీఓలు గ్రూపు సభ్యులు తీసుకున్న బ్యాంక్ రుణాలు రికవరీ చేయించాలన్నారు. స్త్రీనిధి రుణాలు, సీఐఎఫ్, ఉన్నతి ద్వారా తీసుకున్న రుణాలు 90 శాతం రికవరీ చేయాలన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెలిస్తేనే తిరిగి రుణాలు వస్తాయన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న పొదుపు సంఘాల గ్రూపులు

హనుమంతునిపాడు: అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకంపై పొదుపు సంఘాల సభ్యులకు, రైతు సంఘాల పొదుపు గ్రూపు సభ్యులకు సోమవారం అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో (టీఓఎఫ్ఐ అశోక్ మాట్లాడుతూ అటవీయేతర ప్రాంతాలు వెలగు పథకం ద్వారా వృక్ష సంపదను పెంచవచ్చన్నారు. ఆగ్రో ఫారెస్ట్ ద్వారా చెట్ల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఏపీఎం పి.రజనికుమారి, సీసీలు, డానియేలు, అశోక్,పొదుపుసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో నాన్ బెయిలబుల్ వారంట్

కనిగిరి రూరల్: చెల్లని చెక్కు కేసులో ఓ ఉద్యోగికి నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్ జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. చీరాల కోర్టు అమీనాగా పనిచేస్తున్న పాలపర్తి ప్రభాకర్ రావు దర్శికి చెందిన దమాముల చిన వీరయ్య దగ్గర రూ. 2లక్షలు అప్పు తీసుకున్నాడు. దానికి సంబంధించి రెండు లక్షల చెక్కును ఇచ్చారు. సదరు చిన వీరయ్య ఆ చెక్కులను బ్యాంకులో వేయగా, అవి బౌన్స్ అయ్యాయి. దానికి సబంధించిన కేసు ఒక ఏడాది విచారణ జరిగి ఆ నేరం రుజువైంది. ఈమేరకు సోమవారం కనిగిరి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె.భరత్ చంద్ర నిందితుడిని తక్షణం అరెస్టు చేయాలని, నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్‌ను జారీ చేశారు. ఈమేరకు పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు.

పడితే గానీ పట్టించుకోరా..!


పూర్తిగా శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం


పెచ్చులూడి పడుతున్న శ్లాబు

- శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం
- పూర్తిగా దెబ్బతిన్న దర్వాజాలు, కిటికీలు
- విలువైన రికార్డులకు చెదలుపడుతున్న వైనం
- పెచ్చులూడి పడుతున్న శ్లాబు, గోడలు
- చిన్నపాటి వర్షానికి కూడా ఉరుస్తున్న శ్లాబు
- భయాందోళనతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

పొన్నలూరు: పొన్నలూరు తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి భవనం కూలేందుకు సిద్ధంగా ఉండటంతో ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనని ఉద్యోగస్తులు భయందోళనకు గురవుతున్నారు. కిటికీలు, దర్వాజాలు దెబ్బతిని చెదులుపడుతుండటంతో విలువైన రికార్డులు కూడా పాడవుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి పక్కా భవనం నిర్మించి సుమారుగా 35 సంవత్సరాలు. అయితే ఈ భవనం నిర్మించి చాలా ఏళ్లు కావడంతో పాటు నిర్మించే సమయంలో నాణ్యతా ప్రమాణాలను సరిగా పాటించకపోవడంతో ప్రస్తుతం శ్లాబు పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి పడుతోంది. వర్షాలు పడినప్పుడు శ్లాబు ఉరుస్తూ గదుల్లో వర్షం నీరు నిలుస్తున్నాయి. దీంతో కార్యాలయానికి సంబంధించిన విలువైన రికార్డులు తడుస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా శ్లాబు శిథిలావస్థకు చేరడంతో వర్షం నీరు కారుతుండడంతో విధులకు ఆటంకం కలుగుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇటీవల శ్లాబు పెద్ద మొత్తంలో పెచ్చులూడి పడింది. ఆ సమయంలో కార్యాలయం సిబ్బంది ఇంకా విధులకు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కార్యాలయంలోని అన్ని గదుల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం నిర్మించేటప్పుడు పిల్లర్స్‌తో నిర్మించకపోవడంతో ప్రస్తుతం గోడలు, శ్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

చెదలుపట్టిన కిటికీలు, రికార్డులు...

కార్యాలయం గదులకు ఏర్పాటు చేసిన దర్వాజాలు, తలుపులు, కి టికీలకు చెదలుపట్టి చాలా వరకు పాడైపోయాయి. దీంతో తలుపులు వేసే పరిస్థితి లేదు. కొన్ని కిటికీలకు తలుపులు పూర్తిగా ఊడిపోవడంతో కార్యాలయంలోని కంప్యూటర్లు, రెవెన్యూ రికార్డులకు రక్షణ కరువైంది. ముఖ్యంగా భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విలువైన రికార్డులకు కూడా చెదలుపడుతుందని, అప్పుడప్పుడు విష పురుగులు కూడా తిరుగుతున్నాయని కార్యాలయం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టినా...

కార్యాలయానికి మధ్యలో ఒకటి, రెండు సార్లు కొందరు దాతలు చిన్న చిన్న మరమ్మతులు చేయించి రంగులు వేయించారు. అయినా సరే శిథిలావస్థకు చేరడంతో పెచ్చకులూడి పడి వర్షం పడినప్పుడూ ఉరుస్తూ గదుల్లో వర్షం నీరు నిలుస్తున్నాయి. ఇటీవల మరమ్మతులు చేయడానికి పంచాయతీరాజ్ అధికారులు కొలతలు తీసుకున్నా భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వీలుపడలేదు. ఆ తరువాత తహసీల్దార్ భవనం పరిస్థితిపై ఫొటోలుతో సహా ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే ఆర్అండ్‌బీ అధికారులు కూడా కొత్త భవనం నిర్మించడానికి రూ.1.04 కోట్లుతో అంచనాలు తయారు చేసి కలెక్టర్‌కు నివేదించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రమాదం జరగకముందే స్పందించి నిధులు మంజూరు చేసి నూతన తహసీల్దార్ భవనం నిర్మించాలని ఉద్యోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.


చెదలు పట్టి దెబ్బతిన్న దర్వాజాలు, తలుపులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

సీఎస్‌పురం(పామూరు): ఖాతాదారులకు మెరుగైన బ్యాంకు సేవలు అందించడమే కెనరాబ్యాంక్ లక్ష్యమని, ఆదిశగా బ్యాంకు సిబ్బంది పనిచేయాలని బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాఘవేంద్ర అన్నారు. స్థానిక కెనరాబ్యాంక్‌లో సోమవారం ఖాతాదారుల సమావేశం బ్యాంక్ చీఫ్ మేనేజర్ సంజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌యం రాఘవేంద్ర మాట్లాడుతూ బ్యాంకుద్వారా రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి ప్రభుత్వ వడ్డీరాయితీ పొందాలన్నారు. ఇతర రుణాలు తీసుకున్నవారు, పొదుపు మహిళలు సకాలంలో చెల్లించి మరలా నూతన రుణాలు పొందాలన్నారు. ఈసందర్భంగా పలువురు బ్యాంక్‌లో సమస్యలపై మాట్లాడుతూ నగదు చెల్లింపులు, నగదు జమలకు ఒకే కౌంటర్ ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వీటికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరితగతిన ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేస్తామన్నారు. ఫీల్డ్‌ఆఫీసర్ జి.నరేష్, అసిస్టెంట్ మేనేజర్ నౌషిద్, ఇమ్మానియేల్, క్యాషియర్ మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెనరాబ్యాంక్ ఆర్ఎం రాఘవేంద్ర

రోడ్ మార్జిన్‌లో కందకాలు పూడ్చివేత


చెరువుకట్ట కింద ఉన్న కందకాన్ని పూడ్చిన దృశ్యం


పొక్లెయిన్ సాయంతో రోడ్డు మార్జిన్‌ను చదును చేస్తున్న దృశ్యం

- స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు

మద్దిపాడు: మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ టెలిఫోన్ సంస్థ కేబుల్ ఇష్టం వచ్చినట్లు చేస్తున్న తవ్వకాలపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ఇష్టం వచ్చినట్లు చేస్తున్న తవ్వకాలపై సోమవారం సాక్షిలో ‘ అడ్డగోలుగా టెలిఫోన్ కేబుల్ తవ్వకాలు’ అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కేబుల్ ఏర్పాటు కోసం తీసిన కందకాలను పొక్లెయిన్ సాయంతో పూడ్చివేయించి చదును చేశారు. వాహనాలు రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చేశారు. ఆర్అండ్‌బీ రహదారి మార్జిన్‌ను ఇష్టానుసారంగా తవ్వేసిన కంపెనీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ దీప్తి తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలి


మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

సింగరాయకొండ: ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలని ఏపీడీ డి. వెంకటస్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సింగరాయకొండ, జరుగుమల్లి ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు గుర్తించేటప్పుడు నీటి సంరక్షణ పనులు ఎక్కువగా గుర్తించాలని, రైతులకు రైతు వారి కుంటలు ఎక్కువగా చేయించాలని అన్నారు. ఎంపీడీఓ జయమని మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామంలో ప్రతి జాబ్ కార్డు కలిగి ఉన్న వారికి పని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సీడీసీఎల్ఆర్ సీ.లలిత, ఏపీఓలు, సీఈలు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నేటి నుంచి నైపుణ్య శిక్షణ


సిబ్బందితో మాట్లాడుతున్న ఆత్మ డీపీడీ బాలసుబ్రహ్మణ్యం

జరుగుమల్లి (సింగరాయకొండ): ఆత్మ ఆధ్వర్యంలో స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు గ్రామీణ గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ నిర్వహించనున్నట్లు ఆత్మ డీపీడీ బాలసుబ్రహ్మయ్యం, జిల్లా వనరుల కేంద్ర సమన్వయకర్త ఎస్ రామ్మోహన్ రావు తెఇలపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల సహాయ సంచాలకులు వెంకట్రావు, వ్యవసాయ అధికారి వెంకటశేషమ్మ, విస్తరణాధికారులు శ్రీలేఖ, జహీర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్దిరాజు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

వెలిగొండ ప్రాజెక్టు వెంటనే పూర్తిచేయాలి

కనిగిరి రూరల్: జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ శివ శేషవర్ధన్‌రెడ్డికి సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. వెలిగొండ పనులు ప్రస్తుతం 80 శాతం పూర్తయ్యాయన్నారు. రిజర్వాయర్ పరిధిలోని 11 ముప్పు గ్రామాల్లో ప్యాకేజీ లబ్ధిదారులు 7,500 మంది సమస్య పరిష్కారానికి రూ 1,065 కోట్లు, మిగతావి కలుపుకొని రూ 2,000 కోట్లు అవరసమని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని 36 మండలాల్లో 4 లక్షల 50 వేల ఎకరాలకు సాగు నీరు, 15 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుందని తెలిపారు. కెనాల్స్‌కు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని, రానున్న రాష్ట్ర బడ్జెట్లో వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2,000 కోట్లు నిధులు విడుదల చేసి సత్వరమే ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్, పార్టీ మండల కార్యదర్శి జీపీ రామారావు, దళిత హక్కుల పోరాటసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

పామూరు/వెలిగొండ/సీఎస్‌పురం(పామూరు): వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యల్ మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా వెలిగండ్లలో సీపీఐ నాయకుడు గుజ్జుల బాలిరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎస్‌పురంలో సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కే పెద మస్తాన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతిపత్రం అందజేశఆరు. గువ్వల నరసింహులు, బి.వెంకటేశ్వర్లు, బండారు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కనిగిరి రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు మాట్లాడుతూ మార్కాపురం అక్రమంగా తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లో తీసుకోవాలని, 16 రోజుల సమ్మె కాలానికి మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పట్టణంలోని 20 వార్డుల్లో 60 వేలకు పైగా జనాభా ఉన్నారని, దీంతో పారిశుధ్య కార్మికులు సరిపోవడం లేదని, వారి సంఖ్యను పెంచాలని, కరోనా కాలంలో పనిచేసిన వారికి వేతనాలు ఇవ్వాలని, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, కార్మికులకు పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్‌కు అందచేశారు. యూనియన్ నాయకులు సీహెచ్ ప్రసాద్, ఓబయ్య, లక్ష్మయ్య, రవి, ఆనంద్, ఎలీషా, రమణ మ్మ, అంకమ్మ, రోజమ్మ పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న పీసీ కేశవరావు

బోధనా నైపుణ్యం పెంపొందించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కార్యకర్తలు బోధనా నైపుణ్యం పెంపొందించుకోవాలని సీడీపీఓ పి.సరోజిని అన్నారు. సీఎస్‌పురం వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అధ్యక్షతన ఐసీడీఎస్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సీడీపీఓ సరోజిని మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్ర నిర్వహణలో విధిగా సమయపాలన పాటించాలన్నారు. గర్భిణులకు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం సక్రమంగా సమయపాలన పాటించి ఇవ్వాలన్నారు. కేంద్రానికి వచ్చే పిల్లల బరువులు క్రమం తప్పకుండా తీసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రికార్డుల నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కేంద్రం పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలన్నారు. రికార్డులు పరిశీలించారు. సమావేశంలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.సామ్యేలు, వాడా సరళారెడ్డి, రజని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సరోజినీ

అపార్ త్వరితగతిన పూర్తిచేయాలి

- నూరుశాతం ఫలితాలపై దృష్టి సారించాలి

పామూరు: ఆపార్ త్వరతగతిన పూర్తిచేయాలని, వచ్చే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలపై హైస్కూల్ హెచ్ఎంలు దృష్టిసారించాలని కనిగిరి డిప్యూటీ డీఈఓ ఎ.చంద్రమౌళీశ్వర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సోమవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఎం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ అపార్ నమోదుకు అధిక ప్రాధ్యాన్యం ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఎఫ్ఏ-1 పరీక్షల మార్కులను వెంటనే ఆన్‌లైన్ చేయాలని అదేవిధంగా ఎఫ్ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని హెచ్ఎంలకు సూచించారు. నవంబర్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించి జయప్రదం చేయాలన్నారు. ముందుగా స్థానిక ప్రభుత్వ పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఎంఈఓలు డీవీ సుబ్బారావు, గరికపాటి కరుణకుమారి, పీఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, హెచ్‌యం పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

సింగరాయకొండ: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ హజరత్తయ్య అన్నారు. స్థానిక కెనరా బ్యాంకులో సోమవారం సాయంత్రం ఖాతాదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సింగరాయకొండ సీఐ హజరత్తయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఏ విధంగా నేరాలు చేస్తున్నారు కొన్ని ఉదాహరణలతో వారికి వివరించారు. సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎవరికి ఎటువంటి ఓటీపీలు, ఆధార్ కార్డు నంబర్లు చెప్పకూడదని అన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి సైబర్ నేరాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ రామాంజనేయులు, మేనేజర్ విజయభాస్కర్, పాడిబండ్ల కోటేశ్వరరావు ఖాతాదారులు పాల్గొన్నారు.


ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హజరత్తయ్య

ఊరూరా బెల్టు దుకాణాలు..!

- ఒక్కో మద్యం దుకాణానికి 20 బెల్టుషాపులు
- బెల్టు దుకాణానికి క్వార్టర్ రూ.20కు అదనంగా విక్రయం
- డిపాజిట్ కట్టించుకొని మరీ బెల్టుషాపులకు పర్మిషన్లు
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాల వద్దే తాగుతున్న మందుబాబులు
- చోద్యం చూస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు

టంగుటూరు:

కూటమి ప్రభుత్వంలో టెండర్‌లో మద్యం దుకాణాలను దక్కించుకున్న సిండికేట్ బరితెగించింది. గ్రామగ్రామాల బెల్టుదుకాణాలకు తెరలేపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఒక్క బెల్టుషాపు లేకుండా చర్యలు తీసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా ఎక్కపడితే అక్కడ బెల్టుదుకాణాలను తెరుస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బెల్టుషాపుల నిర్వాహకుల దగ్గర నుంచి డిపాజిట్లు సైతం కట్టించుకుంటున్నారు. బెల్టుషాపులకు క్వార్టర్‌కు అదనంగా రూ.20 తీసుకొని వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులు విచ్చలవిడిగా క్వార్టర్‌కు రూ.50 నుంచి రూ.75లకు అధికంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.


టంగుటూరులో వైన్ షాపు పక్కనే మద్యం తాగుతున్న మందుబాబులు

ఒక్కో మద్యం దుకాణానికి 20 బెల్టులు

కొండపి నియోజకవర్గంలో 21 దుకాణాలు ఉన్నాయి. కొండపిలో 3, సింగరాయకొండ 6, పొన్నలూరు 2, జరుగుమల్లి 3, టంగుటూరు 4, మద్దిపూడిలో 3 మద్యం దుకాణాలు ఉన్నాయి, వీటి అనుసంధానంగా ఒక్కో మద్యం దుకాణానికి 20 పైగా బెల్టు షాపులు వెలిశాయి. ఈ బెల్టుషాపు నిర్వాహకులు అధికారులకు నెల నెలా ఎంత ముడుపులు అందించాలో, మద్యం దుకాణాలకు ఎంత డిపాజిట్ చేయాలో, ఎక్కడ బెల్టుషాపు పెట్టుకోవాలో ముందుగానే సిండికేట్ నిర్ణయిస్తుంది. దీంతో సిండికేట్ ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో సిండికేట్ మద్యాన్ని గ్రామ గ్రామాన పారిస్తోంది.

దుకాణాల వద్దే సిట్టింగ్‌లు..

నిబంధనల ప్రకారం దుకాణాల వద్ద కేవలం మద్యం విక్రయాలు మాత్రమే చేయాలి. కానీ మద్యం వ్యాపారులు దుకాణాల వద్దే సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. టంగుటూరులోని ఓ దుకాణం వద్ద ఆహార పదార్థాలు, కుర్చీలు ఏర్పాటు చేసి బార్ అండ్ రెస్టారెంట్ తరహాలో నిర్వహిస్తున్నారు. దీనికి అధికారుల సహకారం పూర్తిగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.